చెక్ పోస్టులో వాహనాల తనిఖీలు

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సిఐ కె.రామారావు తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, మద్యం, నాటుసారా వంటి అక్రమ రవాణాను అరికట్టే దిశగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మండల పరిధిలో రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలు, మహిళలపై అత్యాచారాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మీ పరిసర గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలకు అటు వెళ్లొద్దు

ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపారుల బాగే తమకు ముఖ్యమని కొందరు టిడిపి కూటమి నేతలు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. కల్తీ ఆహారం తిని ప్రజలు అనారోగ్యం పాలైనా తమకేమిటి సంబంధం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆహార తనిఖీలకు వెళ్తున్న అధికారులకు అది తమ వారిదేనని, అక్కడికి ఎందుకు వెళ్లారంటూ నిలదీస్తున్న పరిస్థితి నెలకొంది. తమ పార్టీకి మద్దతుదారులుగా లేక సానుభూతిపరులుగా ఉన్నవారు నిర్వహిస్తున్న దుకాణాలకు వెళ్లకుండా అధికారుల ముందరి కాళ్లకు బంధాలు వేస్తున్నారు. దీంతో ఫలానా ప్రాంతంలో కల్తీ ఆహారం విక్రయిస్తున్నారని తెలిసినా అధికారులు చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం, టెక్కలిలో ప్రజాప్రతినిధులు, నేతలు తీవ్ర జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తునాయి.

పండ్లను ముగ్గబెడుతున్న కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

- శ్రీకాకుళం, టెక్కలిలో అధికారుల ముందరి కాళ్లకు బంధాలు
- ఆహార కల్తీ నియంత్రణశాఖను పట్టించుకోని ప్రభుత్వం
- అధికారులు అంతంత మాత్రంగా దాడులు
- ప్రజల ఆరోగ్యంతో అంతా చెలాగాటమాడుతున్న వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఆహార నాణ్యత గాల్లో దీపంలా మారింది. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో నాణ్యమైన ఆహారం మచ్చుకైనా దొరకడం లేదు. మెరిసేదంతా బంగారం కాదన్నట్లు మనం తినేదంతా మంచి ఆహారమేమీ కాదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఏమీ తింటున్నామో, ఏమీ తాగుతున్నామో? అనే విషయాన్ని చాలామంది పట్టించుకోవడం లేదు. ఆకలైతే ఆ సమయానికి అక్కడ అందుబాటులో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆశ్రయించి ఆకలి తీర్చుకుంటున్నారు. అలసట, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్‌ను తీసుకుంటున్నారు. అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నిల్వ ఉంచిన మాంసాహార పదార్థాలను కుళ్లిన, పాడయిన కూరగాయలతో తయారు చేసిన వంటకాలను వడ్డిస్తున్నారు. ఆకర్షణ కోసం పరిమితికి మించి రంగులు వినియోగిస్తున్నారు. వీటిని తీసుకుంటున్న ప్రజలు వారికి తెలియకుండానే అనారోగ్యం పాలవుతున్నారు.

ప్రభుత్వ ఉదాసీనమే ప్రధాన కారణం

జిల్లాలో ఆహార కల్తీ జోరుగా సాగడానికి ప్రభుత్వ ఉదాసీనమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే శాఖలు తప్ప ప్రజలు ఆరోగ్యం కాపాడే ఇటువంటి శాఖలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆహార కల్తీ నియంత్రణపై అటు రాష్ట్రస్థాయిలోగాని, ఇటు జిల్లా స్థాయిలో గాని ఎవరూ సమీక్షించిన దాఖలాలు లేవు. ఆ శాఖను బలోపేతం చేసే పని కూడా చేయడం లేదు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి లక్ష మందికి ఒకరు, పట్టణ ప్రాంతంలో ప్రతి 50 వేల మందికి ఒక ఆహార భద్రతాధికారి ఉండాలి. జిల్లా కేంద్రంలో కనీసం ఐదు నుంచి ఆరుగురు అధికారులు అవసరం. జిల్లాలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పాటు ఇద్దరు అధికారులు మాత్రమే ఉన్నారు. జిల్లా కార్యాలయంలో సహాయ సిబ్బంది కూడా లేకపోవడంతో అధికారులు రోజువారీ కార్యకలాపాలకే పరిమితమవుతున్నారు. దీంతో తనిఖీలు సక్రమంగా సాగడం లేదు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

జిల్లాలోని 30 మండలాల్లో ఆహార కల్తీ నియంత్రణ పర్యవేక్షణకు ఇద్దరు ఆహార భద్రతాధికారులు ఉన్నారు. వీరు నెలకు కనీసం పది దుకాణాల వరకు తనిఖీలు చేయాల్సి ఉంది. వీరిలో మహిళ అధికారి కొంత వరకు తనిఖీలకు వెళ్తున్నా మరో అధికారి ఎక్కడ ఉంటున్నారో, ఎక్కడకు వెళు న్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజా ప్రతినిధులు, నేతల ఒత్తిళ్లు

ఆహార కల్తీ నియంత్రణ అధికారులు అసలే అంతంత మాత్రంగా తనిఖీలు చేస్తున్నారు. అవీ సక్రమంగా జరగనీయకుండా పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలుస్తోంది. అది తమ వారి దుకాణమే, అక్కడికి ఎందుకు వెళ్లారంటూ అధికారులను నిలదీస్తున్న పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు మాదిరిగానే కూటమి ప్రజా ప్రతినిధులు కొందరు దుకాణాలపై దాడులకు వెళ్లనీయకుండా, కేసులు నమోదు చేయకుండా అడ్డుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మాట్లాడుతున్న రామ్మోహన్, చందు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఉదాసీనం

- లోకేష్ యువగళం హామీలేమయ్యాయి?
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావొస్తున్నా విద్యా రంగ సమస్యల పరిష్కారంలో తీవ్ర ఉదాసీనం చూపుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడానికి విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాద యాత్రలో గత ప్రభుత్వం లోపాలను ఎత్తిచూపుతూ జిఒ నంబరు 117 రద్దు చేసి పాఠశాల విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తానని అన్నారు. ప్రాథమిక పాఠశాలలు మూసివేత ఆపుతానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక జిఒ నంబరు 19, 20, 21 తీసుకొచ్చి ఉన్న పాఠశాలలను మూసివేసే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేష్ జిఒ నంబరు 107 108 రద్దు చేసి మొత్తం మెడికల్ కాలేజీలో ఉన్న సీట్లన్నీ ప్రభుత్వం పరిధిలోనే ఉంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రయివేటు కోసం ఆలోచించడం అన్యాయమని అన్నారు. పాదయాత్రలో జిఒ నంబరు 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఎటువంటి షరతులు లేకుండా ఇస్తామని చెప్పారని అన్నారు. హాస్టల్ మెస్ ఛార్జీలు పెంచుతామన్న మాట కూడా మరిచారని విమర్శించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పారని, ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదని అన్నారు. తల్లికి వందనం ఏడాదికి ఈ రాష్ట్రంలో అర్హులైన విద్యార్థులందరికీ ఇవ్వాలంటే కనీసం రూ.12 వేల కోట్లు అవసరమని, బడ్జెట్‌లో రూ.6 వేలు కోట్లు మాత్రమే కేటాయించారని, మరి ఎలా తల్లికి వందనం ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు తప్పుడు ర్యాంకులతో ప్రకటనలు ఇచ్చి విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తుంటే... వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల విడుదలైన జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో ఎపికి పదో ర్యాంకు తప్ప... ఏ ర్యాంకులు రాకపోయినా నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థలు ఒకటి నుంచి పది లోపు ర్యాంకులు ప్రకటించాయని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థలను గత ప్రభుత్వం ప్రయివేటు పరం చేసిందని, అధికారంలోకి వస్తే నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని, ఎయిడెడ్‌లోనే కొనసాగిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ విద్యలో కార్పొరేట్ విద్యాసంస్థలకు న్యాయం చేస్తూ ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని ఎద్దేవా చేశారు. ఖాళీ పోస్టుల భర్తీ చేయకపోవడం, మౌలిక వసతుల కల్పించకపో వడంతో ప్రభుత్వ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జవసత్వాలు కోల్పోతుందని విమర్శించారు. పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే వాటిని పట్టించుకోని ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలు చేసేలా బ్రిడ్జి కోర్సులకు అనుమతివ్వడమేమిటని ప్రశ్నించారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పెద్ద ఎత్తున ఫీజులు దోపిడీ సాగుతోందని అన్నారు. విద్యా సంస్థల్లోనే పుస్తకాలు, యూనిఫారమ్స్, స్టేషనరీ సైతం విక్రయిస్తూ వ్యాపారం సాగిస్తున్నాయని విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో 30 శాతం మంది ఫ్యాకల్టీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలోనే భర్తీ చేశారని అన్నారు. యూనివర్సిటీలో ఐదుగురు మాత్రమే ప్రొఫెసర్ ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే జోన్‌కు జిఎం నియామకంపై హర్షణీయం

వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మరో ముందడుగు పడిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ నుంచి ఒక ప్రకటనలో విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు శరవేగంగా సాగుతుంది. అందులో భాగంగా రైల్వే జోన్‌కు తొలి జిఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమన్నారు. జోన్ ఏర్పాట్లలో అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నాను. పరిపాల అనుమతులు పనులు వేగవంతమయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. జోన్ ఏర్పాటుతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు.

ప్రజల విశ్వాసం నిలబెట్టేలా పనిచేయాలి

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పనిచేయాలని, ఉన్న లోపాలన్నింటిని గుర్తించామని, త్వరలోనే సమస్యలు పరిస్కరిస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. జిల్లాలోని జిజిహెచ్ అభివృద్ధిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి సామర్థ్యం పెరిగిన నేపథ్యంలో విద్యుత్, మురుగునీటి వ్యవస్థల బలోపేతానికి తగిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. సిబ్బంది ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని, ఆస్పత్రి భవనాలపై సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమూల్య మాట్లాడుతూ 300కు పైగా ఎసిల వార్షిక నిర్వహణ, 60 కంప్యూటర్ల సంరక్షణకు రూ.12.25 లక్షలు అవసరమైందని వివరించారు. వర్షాకాలంలో రేడియాలజీ విభాగంలోకి నీరు చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. విభాగాధిపతులు సందర్భంగా మాట్లాడుతూ ఒపి రద్దీ దృష్టిలో పెట్టుకుని ఐసియు, సిసియు, ల్యాబ్‌లను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ప్రత్యేక నిపుణుని నియమించాలన్నారు. మార్చురీ వద్ద ఆధునీకీకరణ అవసరమని, 8 బాడీ కూల్ ఛాంబర్లు, ఫ్రీజర్లు, శవ పరీక్ష టేబుల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పిజి విద్యార్థుల ప్రతినిధి మాట్లాడుతూ గుండెపోటుతో వచ్చే రోగులకు ప్రాథమిక చికిత్స మాత్రమే అందిస్తున్నామని, పూర్తిస్థాయి సేవల కోసం అత్యవసర పరికరాలు కావాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమీక్షలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవివెంకటాచలం, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ముందుగా బోయింగ్ ఇండియా సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ వైద్య కళాశాలకు, ఆస్పత్రికి రూ.45 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అమూల్య, బోయింగ్ ఇండియా నుంచి డాక్టర్లు ప్రవీణ్, రజత్, అమృత, రోహిత్, జిజిహెచ్, రిమ్స్ వైద్యులు మురళీకృష్ణ, డాక్టర్స్ ఫర్ యు సంస్థ నుంచి జైన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళం

తమకు అన్యాయం జరిగిందంటూ ఉపాధ్యాయుల ఆవేదన

శ్రీకాకుళం ప్రతినిధి : ఉపాధ్యాయ బదిలీల్లో శుక్రవారం కొంత గందరగోళం చోటు చేసుకుంది. బదిలీలకు సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో సమస్య గందరగోళానికి దారితీసినట్లు తెలిసింది. స్కూల్ అసిస్టెంట్స్ (తెలుగు)కు సంబంధించి బదిలీల ఖాళీల సంఖ్య కంటే దరఖాస్తు చేసుకున్న వారు ఎక్కువగా ఉండటంతో కొంత మందిని క్లస్టర్ హైస్కూళ్లకు కేటాయించారు. బదిలీలకు ఆప్షన్ ఇచ్చే సమయంలో ఇవి జూనియర్లకు కేటాయింపు అయినట్లు తెలిసింది. దీంతో తమకు తీవ్ర నష్టం జరిగిందంటూ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులు డిఇఒ డాక్టర్ తిరుమల చైతన్య దృష్టికి తీసుకువెళ్లారు. సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల ఈ ఇబ్బంది వచ్చిందని వారికి చెప్పకుండా కమిషనర్‌కు చెప్పుకోవాలంటూ కరకుగా చెప్పడంతో వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ సమస్యపై తొలి నుంచి ప్రభుత్వానికి చెప్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. స్కూల్ అసిస్టెంట్స్ (తెలుగు) ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

అప్పలరాజు విషప్రచారం మానుకోవాలి

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు

ప్రజాశక్తి- పలాస

విఠల్‌రావు

మద్యంపై అక్రమ వసూళ్లు చేస్తున్నామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు చేస్తున్న విషప్రచారం మానుకోవాలని, దీనిని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు శవాల్ విసిరారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు. 'చింతచచ్చినా పులుపుచావదు' అనే చందంగా మాజీ మంత్రి తీరు ఉందన్నారు. నాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మతిస్థిమితం లేదని, ప్రస్తుతం ఆయన తెలివైన వాడని మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మీ అన్న త్రినాథ్ చేసిన సెటిల్మెంట్లు తమ వద్ద ఆధారాలతో ఉన్నాయని అన్నారు. నల్లబొడ్లూరు కొండను రూ.4కోట్లకు అమ్ముకోవడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎంఐజి లేఅవుట్లో పది శాతం కమిషన్ రైతులు వద్ద కొట్టారని, ఉజ్జుడుమెట్లలో సంబంధిత రియల్టర్ వద్ద కొట్టిన నిధులెంత అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఏడాదిలో చేసిన అభివృద్ధి చూడలేక తప్పుడు ప్రచారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లలో ఏమి అభివృద్ధి చేశారో అప్పలరాజు చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. ఇకనైనా అబద్ధపు మాటలు ఆపి అభివృద్ధికి సహకరించాలన్నారు. లేకుంటు తన సవాల్‌కు స్పందించాలని సూచించారు.

డిఎస్‌సి పరీక్ష పారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సి పరీక్షలు శక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాకు సంబంధించి ఆరు అన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. 37,982 మంది జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు మూడు పరీక్ష కేంద్రాల్లో రెండు షిప్టుల్లో, ఒక పరీక్ష కేంద్రంలో ఒక షిఫ్టులో పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎంఐటి బరంపూర్‌లో ఒక్క షిప్టులో, ఎచ్చెర్ల వెంకటేశ్వన, నరసన్నపేట కోర్ టెక్నాలజీస్, రాజాం జిఎంఆర్‌లో పరీక్షలు రెండు షిఫ్టుల్లో జరిగాయి. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1459 మందికి, 1302 మంది హాజరయ్యారు. 157 మంది గైర్హాజరయ్యారు. డిఇఒ తిరుమల చైతన్య వెంకటేశ్వర ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలోకి గంటునన్నర ముందు విడిచి పెట్టారు. మొదటి రోజు ఎటు సమస్యలు లేకుండా పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

వెంకటేశ్వరలో హాల్‌టిక్కెట్లను పరిశీలిస్తున్న అధికారులు

దారిదోపిడీ దొంగలు అరెస్టు

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం సిటీ: జిల్లాలోని టెక్కలి, నందిగాం, నరసన్నపేట, లావేరు మండలాలు పరి ధిలో జాతీయ రహదారిపై రాత్రి వేళలు ఆగి ఉన్న వాహనదారులను బెదిరించి నగదు, మొబైల్ ఫోన్‌లు దోచుకుంటున్న ముఠాను అరెస్టు చేశామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిందితులను శుక్రవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారని అన్నారు. రణస్థలం మండలం కోష్ట ప్రాంతంలో టెంట్లు వేసుకుని నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వీరు రాత్రి వేళలో నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తు తేలిందని వెల్లడించారు. బయట ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగతనం చేశారని అన్నారు. బొడ్డేపల్లి సతీష్‌కుమార్, సేపేన బెనర్జీ ఇరువురు కలిసి వారి మోటార్ సైకిల్‌పై

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

నందిగాం మండలం కనితూరులో వివాహ వేడుక అనంతరం తమ గ్రామ ఆమదాలవలస వస్తున్నారని అన్నారు. మార్గంమధ్యలో జాతీయ రహదారిపై వర్షం కారణంగా టెక్కలి మండలం విక్రంపురం గ్రామ బస్సుస్టాఫ్ వద్దకు చేరి, వేచి ఉన్నారని అన్నారు. నలుగురు వ్యక్తులు వారి వద్దకు వచ్చి కత్తులు చూపించి, డబ్బులు, మొబైల్ ఫోన్లు ఇవ్వమని బెదిరించారని తెలిపారు. అందుకుగాను వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నలుగురూ కలిసి దాడిచేసి వారి వద్ద నుంచి రూ.6 వేలు, రెండు సెల్ ఫోన్లు లాక్కున్నారన్నారు. వీరు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసులతో ఐదుగురికి సంధం ఉండగా, ఆదిత్య పవర్, బంగారం పవర్, సుధీర్‌పవర్, శరత్ షిండేలను అరెస్టు చేశామన్నారు. సంజూ షిండే కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. వీరు ప్లాస్టిక్ వస్తువులు, వస్త్రాలు ఉదయం బైక్‌లపై అమ్మటం, రాత్రులు దోపిడీలకు పాల్పడడం చేస్తుండేవారని చెప్పారు. సారవకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల చోరీ, ఇళ్లల్లో దొంగ తనానానికి పాల్పడుతున్న బస్వాసుధాకర్‌రెడ్డి నిందితుని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో రూ.23.05 లక్షలు విలువైన బంగారు అభరణాలు, 15 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు కె.వి.రమణ, శ్రీనివాసరావు, సిఐలు పైడపునాయుడు, సూర్యచంద్రమౌళి, ఇమ్మాన్యుయేల్‌రాజు, విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 10 నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత కలిగిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు www.cse.ap.gov.in,apms.ap.gov.in వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు.

తాగునీరు అందించాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశకి- పలాస

సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చడానికి ఉద్దానం పథకం ద్వారా తాగునీరు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింధూర జలసరి ద్వారా ప్రస్తుతం పలాస మున్సిపాలిటీలో 60 శాతం మందికే తాగునీరు అందుతుందని, మిగిలిన వారికీ నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం పైపులైన్ ఉన్న దగ్గర 1774 వాటర్ ట్యాప్ కనెక్షన్స్ ఇచ్చామని, ఇంకా 554 మందికి టాప్ కనెక్షన్స్ ఇవ్వాలని అధికారులు తెలియజేశారు. సూదికొండ, రోటరీ నగర్, శివాజీ నగర్ మున్సిపాలిటీలో ఇంకా కొన్ని వార్డులకు సిందూర జలసిరి ద్వారా నీరందించడానికి ఐదు కిలోమీటర్ల పైప్‌లైన్ వేయాలని అధికారులు తెలియజేశారు. దానికి సంబంధించి ఎస్టిమేషన్స్ రూ.1.5 కోట్లు అవుతుందని అధికారులు తెలియజేశారు. కిడ్నీ ఆస్పత్రికి సిందూరు జలసిరి ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ రంగ ప్రసాద్, ఉద్దానం ప్రాజెక్టు డిఇ ఆశాలత పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.455/2024ఇన్
యం.వి.ఓ.పి.నెం.1140/2022

బిట్వీన్:
జాలాది మోక్షిత ....పిటీషనరు
మరియు
యన్.ఉదయ చంద్రరావు వగైరాలు ....రెస్పాండెంట్లు

టు,
3వ రెస్పాండెంటు: బదన లక్ష్మునాయుడు, తండ్రి.జమ్ము, నివాసం.జమ్ము, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా. (లారీ డ్రైవర్ నెం.AP 07 X 7921)

పై నెంబర్ ఐ.ఎ.లో 3వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.17-06-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదారోజు ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను.లేని యెడల సదరు పిటీషను మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

వాయిదా తేది:17-06-2025

గింజుపల్లి సురేష్,
పిటీషనరు తరపు న్యాయవాది,
2/18 బ్రాడీపేట, గుంటూరు,

IN THE HONOURBLE COURT OF THE JUNIOR CIVIL JUDGE NARASANNAPETA
O. S. NO. 30/2024

Between:-
Karur Vysya Bank Ltd., Narasannapeta, represented by its branch Manager. Narasannapeta town & mandal, Srikakulam district ....Plaintiff.
And:-
Rella Harishankar Nehru, S/o Venkatarao. .....Defendant.

NOTICE

To,
Rella Harishankar Nehru, S/o Venkatarão, R/o D. No. 6-215, N.T. R. colony. Tekkali town & mandal, 18th line. Srikakulam district. Pin. 532201. Contact No. 9059140071. .....Defendant

Whereas plaintiff bank has instituted the above suit/application filed against you for recovery of your loan amount. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed, and able to answer all questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions on the **26th day of June, 2025 at 10-30 a.m.,** failing which the suit/application will be disposed of ex-party.

IPPILI TATA
IPPILI CHARUMATHI
ADVOCATES FOR PLAINTIFF,
NARASANNAPETA, CELL: 9440513527.

ప్రజాశక్తి
www.prajasakti.com

తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ దుర్గాప్రసాద్

అన్ని బ్రాండ్లూ అమ్మాల్సిందే

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండల కేంద్రంలో గత రెండు రోజులుగా తక్కువ రేటు మద్యం విక్రయాలు నిలిపివేసిన దుకాణందారులు 'ప్రజాశక్తి' కథనానికి తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం ఉదయం నుంచి అన్ని ధరలకు చెందిన మద్యం సీసాలు దుకాణంలో విక్రయించారు. రెండు రోజులుగా రూ.120, రూ.130, రూ.140 రకాలకు చెందిన మద్యం విక్రయాలు కవిటి మండల కేంద్రంలో నిలిపివేశారు. కూలి పని చేసుకుని మద్యం కొనుగోలు చేసే పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుకాణంలో సరుకు ఉంచుకునే విక్రయించకపోవడంతో ప్రజాశక్తిని సంప్రదించారు. దీనిపై ప్రజాశక్తిలో 'సిండికేట్‌గా దోచేస్తున్నారు, అంతా మా ఇష్టం' అంటూ కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఎక్సైజ్‌శాఖ సిఐ దుర్గాప్రసాద్ గురు, శుక్రవారాలు సంబంధిత దుకాణాలు సందర్శించి దుకాణదారులను హెచ్చరించారు. స్టాక్ రికార్డులు పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు. దుకాణంలో సరుకు ఉంచుకునే విక్రయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రకాల మద్యం సీసాలు దుకాణంలో విక్రయించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను వచ్చిన వెళ్లిన తరువాత మళ్లీ విక్రయాలు నిలిపివేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రజాశక్తిని అభినందించారు. దీంతో స్థానికంగా ఉన్న మద్యం బాబులకు ఉపశమనం లభించింది.

స్వీట్ తినిపిస్తున్న ఉపాధ్యాయులు

బొరివంక విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 8మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికై సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన దున్న చందు, బార్ల శ్రీకర్, శమల్ల జాహ్నవి, బైరి రిషి, దశ్యా వినయ్, మాదిన పూర్ణిమ, మార్పు ఐశ్వర్య, కొరికాన కావ్య మంచి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల ప్రోత్సాహకం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులకు సర్పంచ్ శ్రీరామ్ ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ కృష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బల్లెడ శ్రీపతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న దుర్గారావు

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గోపాలపురం ప్రధాన రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాడుక, పాటు వర్షపు నీరు చేరడంతో ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడేవారు. ప్రజల కష్టాలను చూసిన గ్రామ జన సైనికులు పలాస నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఆయన స్పందించి సొంత ఖర్చులతో గోతులను పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రోడ్లపై తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. పంచాయతీ ఇంజినీర్‌తో మాట్లాడి కొత్తగా మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించమని కోరామని చెప్పారన్నారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్‌ఛార్జీ దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, యవ్వారి తిరుపతి రావు, కిల్లి కైలాస్‌సాప హరికృష్ణ, కమిటీ రమేష్, బొడ్డేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా వరి విత్తనాలు

అంగట్లో వరి విత్తనాలు

బూర్జ : అంగట్లో విచ్చలవిడిగా వరి విత్తనాలు విక్రయాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులతో గ్రామీణ ప్రాంతాల్లో వరి విత్తనాలు, ఎరువులను విక్రయించాల్సి ఉన్నప్పటికీ వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని ఉవ్వపేట, బూర్జ గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు విత్తనాలను విక్రయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

జిఎం నియామకంపై హర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అందుకు నిదర్శనమే రైల్వే జోన్ తొలి జిఎంగా సందీప్ మాథూర్‌ను నియమించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పరిపాలన పనులు అనుమతులు వేగవంతం అయ్యేందుకు ఈ నియామకం దోహదపడుతుందని అన్నారు. రైల్వే జోన్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. విశాఖ రైల్వే జోన్‌పై త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా కూడా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నందన్నారు.

శ్రీకాకుళం: దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసిందని, అందులో భాగంగా జిఎంగా సందీప్ మాథుర్‌ను నియమించడం హర్షణీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ నియామకంతో పనులు, పరిపాలన వ్యవస్థ వేగవంతమవుతుందని, రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు నాయుడు విశేష కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైల్వేజోన్ కోసం అనేకసార్లు సిఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకువచ్చారని, అందువల్లే సాధ్యమైందన్నారు.

లాడ్జీల్లో విస్తరిస్తున్న 'చీకటి దందా'!

- రాత్రివేళ పెద్దఎత్తున సాగుతున్న పేకాట
- నిర్వాహకులపై చర్యలు కరువు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జిల్లా ముఖద్వారం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న కొన్ని లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ లాడ్జీలపై సరైన నిఘాలేని కారణంగా ఆ లాడ్జీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక్కడి లాడ్జీల్లో కొనసాగుతున్న అక్రమ దందాలు సభ్య సమాజానికే తలవంపులు తెస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఓవైపు పేకాట, జూదం, మరోవైపు నరకకూపాలుగా పిలుచుకునే వ్యభిచారం వంటి అనైతిక కార్యకలాపాలకు లాడ్జీలు అడ్డాలుగా మారాయన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఇక్కడ కొన్ని లాడ్జీల నిర్వాహకులు తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో ఇలాంటి దందాలను దర్జాగా సాగిస్తున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం సీరియస్‌గా పట్టించుకోవడం లేదన్న వాదనలున్నాయి. అయితే స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఇటీవల కొన్ని లాడ్జీపై పోలీసులు ఆకస్మికంగా దాడి జరిపినా ముందస్తు సమాచారంతో ఎవరూ దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ లాడ్జీల్లో యథేచ్ఛగా అనైతిక దందా కొనసాగుతున్న విషయం పోలీసులకు ఆలస్యంగా తెలియడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లాడ్జీలో కూడా గత కొద్దిరోజుల నుంచి పేకాట, జూదం, వ్యభిచారాలు పెద్దఎత్తున సాగుతున్నట్లు బహిరంగంగానే పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడి పలు లాడ్జీల్లో జరిగే పేకాట, జూదంలో పొరుగు జిల్లాలకు చెందిన జూదరులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారని, లాడ్జీల్లో పేకాట ఆడే వారి నుంచి పెద్దమొత్తంలో వసూళ్లు చేస్తున్నారని, జూదరులందరికీ మందు సౌకర్యంతో పాటు ఇతర అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారన్న విమర్శలున్నాయి. మొన్నటి వరకు పేకాట దందా లాడ్జీల్లో రహస్యంగా సాగినప్పటికీ గత కొద్దిరోజుల నుంచి యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. పేకాట నిర్వహించే వారు ఈ లాడ్జీ నిర్వాహకులతో మిలాఖతై ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పొరుగు జిల్లాల నుంచి వస్తున్న జూదరులు

పైడిభీమవరంలో కొన్ని లాడ్జీల్లో పెద్దఎత్తున జూదం సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కొంతమంది పేకాట ఆడించేవారు ఈ లాడ్జీల్లోని కొన్ని గదులను నెలల తరబడి అద్దెకు తీసుకుంటున్నట్లు సమాచారం. సాధారణ కస్టమర్లకు తీసుకునే అద్దె కన్నా ఇలా పేకాట జూదరుల కోసం తీసుకునే వారి నుంచి రెండు, మూడింతలుగా ఎక్కువగా అద్దె వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే పేకాట నిర్వాహకులు పొరుగు జిల్లాల నుంచి జూదరులను ఇక్కడికి రప్పించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. లక్షల రూపాయల్లో సాగుతున్న పేకాట కారణంగా నిర్వాహకులు కేటీ పేరిట పెద్దఎత్తున వసూలు చేస్తున్నట్లు సమాచారం. పెద్దఎత్తున పేకాట, జూదం సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇష్టారాజ్యంగా అసాంఘిక కార్యకలాపాలు

పారిశ్రామిక వాడలోని కొన్ని లాడ్జీల్లో ఇష్టారాజ్యంగా అసాంఘిక కార్యకలాపాలతో పాటు భూముల సెటిల్‌మెంట్‌లు, అలాగే సివిల్ పంచాయతీలతో పాటు వ్యభిచారం సైతం చాలా రోజుల నుంచి యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

లోపించిన నిఘా

పైడిభీమవరం ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకు విస్తరిస్తున్నప్పటికీ వాటిని అరికట్టడంలో సంబంధిత యంత్రాంగం విఫలమవుతున్నట్లు ఆరోపణలున్నాయి. సరైన నిఘా లేకపోవడంతో లాడ్జీలు అధికమవుతున్నాయని, సమాచార వ్యవస్థ పకడ్బందీగా లేని కారణంగా ఇలాంటి కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్న నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకున్నట్టయితే పునరావృతం కావని, నామమాత్రపు చర్యలతో ఎలాంటి ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘా వ్యవస్థతో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిరాయితీ పట్టాలు సృష్టించడం అన్యాయం

దళితుల భూములు సర్వే చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

దళితుల డి పట్టా భూముల్లో అగ్రకుల పెత్తందారు మందపల్లి సూర్య ప్రకాశరావు జిరాయితీ పట్టాలు సృష్టించుకోవడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారావు సింహాచలం అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నంపేటలో దళితులకు ఇచ్చిన డి పట్టా భూములను పరిశీలించి సర్వే చేయడానికి స్థానిక తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వే బృందం రావడం జరిగిందన్నారు. అయితే పెత్తందారు సర్యప్రకాశరావు కూడా రావడం జరిగిందన్నారు. సర్వే అనంతరం సర్వే బృందం ఈ భూమి సూర్యప్రకాశరావుకు చెందినదిగా నిర్ణయించారని, వారసత్వంగా వచ్చిన భూమిగా తెల్చి చెప్పడం అన్యాయమని, సుమారు 80 ఏళ్లుగా అనేకమంది పేదలు వరకట్టి సాగు చేస్తూ అనుభవిస్తున్నట్లు గ్రామస్తులందరికీ తెలుసునన్నారు. అయినా రెవెన్యూ సిబ్బంది 70 ఏళ్లుగా భూమిని అనుభవిస్తున్న వారికి కనీసం సాగు నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. జిరాయితీ భూముల్లో ప్రభుత్వం దళితులకు డీ పట్టాలు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. 50 ఏళ్లు కావస్తుందని, పట్టాలిచ్చి 50 ఏళ్లు అయినా సూర్య ప్రకాశరావుకు ఈ భూములు గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. థర్మల్ పవర్‌ప్లాంట్ ఈ ప్రాంతానికి వస్తుందని పుకారులు రావడంతో సూర్య ప్రకాశరావు ప్రత్యక్షమై స్థానిక పెత్తందారుల సహకారంతో ఈ భూములు కాజేయడానికి తన పేరున హక్కులు సంపాదించినట్లు ఆయన ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని డీ పట్టాలు కలిగిన దళితులకు సాగు చేస్తున్న వెనుకబడిన కులాల వారికి ఈ భూములపై హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అగ్రకుల పెత్తందారు సూర్యప్రకాశరావు దళితులు, పేదలపై జులుం చేస్తున్నాడని ఇది సరైన పద్ధతి కాదన్నారు. సాగులో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని, తప్పుడు పట్టాలు సృష్టించిన పెత్తందారు హక్కులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయనతో కిరణ్, కంట అప్పలనాయుడు, కార్మిక సంఘం మండల కార్యదర్శి దంత శ్రీరామ్, పొన్నాడ గౌరమ్మ, సాకేటి అప్పారావు, దన్నాన లక్ష్మి, గణపతి, సూర్యనారాయణ, లోకలాపు అప్పారావు, కె.లక్ష్మి, నేతల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు ఆర్థికసాయం

శ్రీకాకుళం సిటీ: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బిడ్డిక అప్పలస్వామికి ఆర్థిక చేయూతగా నగదు చెక్కును జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. జిల్లాలోని తోటి హోంగార్డులు అందించిన ఒక్కరోజు వేతనం మొత్తం రూ.4.03 లక్షల నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి శేషాద్రి, ఎఒ సిహెచ్ గోపినాథ్, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్‌ఎస్ఐ హరినాథ్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

పనిగంటలు పెంచడం దుర్మార్గం

టెక్కలి రూరల్ : కార్మికుల పని గంటలను పెంచుతూ ఎపి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ... శుక్రవారం టెక్కలి చిన్నబజారు వీధి కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని గంటలు పెంచడం దుర్మార్గచర్య అని అన్నారు. కార్మికుల వేతన సవరణ, సంక్షేమం చూడాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారుల లాభాల కోసం కార్మికులను బలి పశువులు చేయడం సరికాదని అన్నారు. తక్షణం పని గంటలు పెంపుదల నిర్ణయాన్ని ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, ధర్మ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ

లావేరు: రేషన్ పంపిణీలో భాగంగా వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులను డీలర్ వారి ఇంటికి వెళ్లి అందజేస్తున్నారు. మండలంలోని 58 రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ వేగవంతంగా జరుగుతుందని ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

రణస్థలం రూరల్: ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పైడిభీమవరం గ్రామ సచివాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఎంపిడిఒ, తహశీల్దార్‌కు పంపించి పరిష్కరించాలన్నారు. మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, సర్పంచ్ సింక భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, పిన్నింటి భానోజీ నాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి ప్రకాశరావు, సెక్రటరీ అజయ్ బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రారంభిస్తున్న రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని శిశుగృహం, బాలసదనంలో ఏర్పాటు చేసిన క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్, సిక్‌రూమ్, రెండు పోషణ వాటికలు ఇటీవల మరమ్మతులు పూర్తయియ్యాయి. ఈ సుందరీకరణ పనులను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం ప్రారంభించారు. చైల్డెన్ హోమ్‌లో పిల్లలతో ముచ్చటించారు. వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. వారితో సన్నిహితంగా మమేకమై వారి అవసరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మహిళా, శిశు అభివృద్ధిశాఖ పీడీ బి.శాంతిశ్రీ, డిసిపిఒ రమణ, మోడల్ ఆఫీసర్ పుణ్యవతి, శిశుగృహ మేనేజర్ నరేష్, దాసు నాయుడు పాల్గొన్నారు.

శిశుగృహంలో శిశుసేవలకు నూతన వేదిక

జిల్లా ప్రతిష్టను చాటాలి

కటక్ వేదికగా మే 30 నుంచి జూన్ 1 వరకూ జరిగిన 9వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం అభినందించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో మొత్తం 26 పతకాలను సాధించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన సీనియర్ కోచ్‌లు గౌతమ్, నవీన్, వంశీ, మేనేజర్ హేమంత్ ఖాన్, కోచ్ హరిలను ప్రశంసించారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, భవిష్యత్‌లో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలను తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ వాసునాయుడు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను ప్రతాప్, నాయకులు లోలుగు వెంకటే, బస్వా నాని, దుంగ భాస్కర్, కోరాడ హరగోపాల్, న్యూట్రిషన్ కోచ్ నాగరాజు, కెల్ల గిరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఆమదాలవలస : ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ తదితరులు

ప్రజాశక్తి- పలాస

యోగాతోనే ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులుగా తయారవుతారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ గంట సేపు యోగ చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, మనసు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జి.వెంకటేష్, పశువైద్యశాఖ అధికారి పోతనపల్లి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, టిడిపి నాయకులు విఠల్‌రావు, గాలి కృష్ణారావు, దడియాల నరసింహులు, చంద్రశేఖర్‌త్యాడి, మల్లిపెద్ది చిన్ని పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా అవసరమని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి యోగా అవగాహన ర్యాలీని మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: యోగ చేయడం వలన ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, పలు శాఖల సిబ్బందితో యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సూర్యతేజ' విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న పద్మజ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు ఒకే విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఐదు ప్రతిభా అవార్డులు లభించాయని కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ, కామేశ్వరరావులు తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధికంగా 989 మార్కులు సాధించిన బైపిసి విద్యార్థిని గొట్టావు ప్రియాంకకు మొదటి స్థానంలో రాగా, 978 మార్కులు సాదించిన బైపిసి విద్యార్థిని కొండగొర్రి పద్మజ, 975 మార్కులు సాధించిన హెచ్ఐసి విద్యార్థిని కోనారి లక్ష్మీప్రియకు, 911 మార్కులు సాదించిన హెచ్ఐసి విద్యార్థి కొతి యుగంధర్‌కు, 984 మార్కులు సాధించిన ఎంపిసి విద్యార్థిని హన్సికకు రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డులను బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రకటించిందని తెలిపారు. గతంలో తమ కళాశాల నుంచి 215లో దట్టి పద్మజకు, 2016లో సవర జగన్నాథంకు, 2017లో సవర రవికుమార్‌కు రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డులు లభించాయన్నారు. అయితే ఈ ఏడాది ఒకే విద్యాసంవత్సరంలో ఐదు ప్రతిభా అవార్డులు రావడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. వికష్టపడి చదవిని విద్యార్థులకు, బోధించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

గంజాయితో పట్టుబడిన నిందితుడు

గంజాయితో ఒడిశా వాసి అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న గంజాం జిల్లాకు చెందిన చాబి సాహును అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 17.450 గ్రామాలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని శుక్రవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. గంజాయితో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్నాడని అన్నారు. పట్టణ పోలీసులు అదుపులో తీసుకోని తనిఖీలు చేయగా గంజాయి లభించిందన్నారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

'ఉపాధి' ఉద్యోగిపై కూలీలు ఫిర్యాదు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్ద పద్మాపురం పంచాయతీకి బేర్‌ఫుట్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న పడాల వెంకటరమణపై ఇటీవల ఉపాధి కూలీలు మండల అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం పెద్దపద్మాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వచ్చారు. విషయం తెలుసుకున్న ఉపాధి కూలీలు టెక్నికల్ అసిస్టెంట్ ప్రవర్తించిన తీరుపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పలువురు మేట్లు, కూలీలు మాట్లాడుతూ ఇటీవల పనుల వద్దకు వచ్చి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని అన్నారు. పరుష పదజాలం వాడి, మహిళల ఫోన్ నంబర్లు అడిగి నేరుగా అతనికి మెసేజ్లు చేయమని, రాత్రి వేళల్లో ఏకాంతంగా మాట్లాడాలని చెప్తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఒక్కరోజు కూడా పని వద్ద కొలతలు ఇవ్వడం, తీయడం చేయలేదన్నారు. తనకు నచ్చిన విధంగా తనకు తోచినంత కూలి చెల్లించేవారని తెలిపారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. బిఎఫ్‌టిపై వెంటనే పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంకటరమణపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఉపాధి కూలీలకు ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే తన దృష్టిలోకి తీసుకురావాలన్నారు.

9న అప్రంటీస్ మేళా

శ్రీకాకుళం సిటీ: ఈ నెల 9న ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐలో అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకరరావు ప్రకటనలో తెలిపారు. ఏడు ప్రముఖ కంపెనీలు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

లావేరు తహశీల్దార్ బదిలీ

లావేరు: లావేరు మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న మంగం రాజశేఖర్‌కు బదిలీ అయ్యింది. విజయనగరం జిల్లా రాజాం మండల తహశీల్దార్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో కొత్త తహశీల్దార్ రావాల్సి ఉందని ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

శ్రీకాకుళం సిటీ: బక్రీదు (ఈదుల్ అజ్ హా) పండగను మతసామరస్యానికి ప్రతీకగా కుల, మతాలకు అతీతంగా సోదర భావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత పోలీసు అధికారులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

కార్పొరేట్ ఫాసిజాన్ని ప్రతిఘటిద్దాం

ప్రజాశక్తి- పలాస

విప్లవ సాంస్కృతికోద్యమాన్ని బలోపేతం చేద్దామని, మనువాద, కార్పొరేట్ ఫాసిజాన్ని ప్రతిఘటిద్దామని అరుణోదయ కమిటీ జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో ప్రజా సంఘాలతో కలిసి అరుణోదయ సంస్థల విలీన సభ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలీనం సభ వివరాలను రామారావు వివరించారు. ఈ నెల 8న ఉదయం 9.30 గంటలకు సరస్వతీ పార్కు నుంచి సభా ప్రాంగణం వరకు జరిగే కళా ప్రదర్శన ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు జెండా విష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గోరకల బాలకృష్ణ, పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్ పాల్గొన్నారు.

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఓవిపేట ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి భవిష్యత్‌లో ఖాళీ అయ్యే సీట్లు కొరకు 7, 8. 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20లోపు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

పాతపట్నం: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం విత్తనాలు, వ్యవసాయ పరికకరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని విన్నవించారు. స్థానిక రైతులు సమస్యలపై అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించగా తక్షణమే స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మంచు కరుణాకరరావు, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎఒ రవి కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ


పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంజిఆర్

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మపురం సచివాలయం వద్ద ఎమ్మెల్యే గోవిందరావు విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, డిటి రాము, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కం గౌడ్, మాజీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, నంబాల వెంకటరావు, ఉర్లాన వసంత్, బసవ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలాస : మండలంలోని కంబ్రగడలో ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే ఉపాధిహామీ నిధులు రూ.పది లక్షలతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. పి.విఠల్‌రావు, ఎంపిడిఒ వసంతకుమార్, వ్యవసాయశాఖ ఎఒ పోలారావు, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తొగరాంలో రైతుసేవా కేంద్రం వద్ద వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. 40 రోజుల శిక్షణ కాలంలో వివిధ పోటీలు నిర్వహించారు. ు విశ్రాంత గ్రంథాలయ అధికారి కాళ్లరాజు అధ్యక్షతన విశ్రాంత ఎంఇఒ ఎస్.చిరంజీవిలు, టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, డాక్టర్ ఆర్.మల్లికార్జునరావులు విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జి.వి.ఎస్.రాజేష్, ఎం.సాయి, మెడికల్ ఆఫీసర్ పూర్ణిమ, పాఠకులు యాళ్ల ప్రవీణ్, సంతోష్, మీనాకుమారి, రంజిత్, మోహనరావు, బోగేష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మానాభరావు, నలంద ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్, ఉపాధ్యాయులు శ్వేత, భారతి, నీలిమ, గిరిజారాణి, పండు, ధనూష తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు విశ్రాంత గ్రంథాలయశాఖాధికారి శ్రీరాములు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి.ఇందిర పాల్గొన్నారు.

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఏప్రిల్ 28 నుంచి నేటివరకు వేసవిజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులతో జనసేన కార్యకర్తలు

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి- ఆమదాలవలస

జనసేన సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని జనసేన నాయకుడు కోరుకొండ మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నిమ్మతొర్లాడలో జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నాడూ చూడని విధంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. గతంలో ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందించారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మీసాల రాజనాయుడు, బుల్లిబాబు, సోమరాజు, రవికుమార్, లీలా మోహన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కరుణాకరరావు

ప్రకృతి వ్యవసాయం మేలు

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పశుగ్రాస పెంపకం పాడి రైతుకు ఎంతో మేలుచేకూరుతుందని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అభిప్రాయపడ్డారు. మండలంలో సీదిలో శుక్రవారం పాడి రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పశుగ్రాస పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పిఎండిఎస్) పద్ధతిలో పశుగ్రాస విత్తనాలు భూమిలో చల్లితే, భూసారం పెరుగుతుందన్నారు. 32 రకాల విత్తనాలు ఒకే కిట్‌లో ప్రకృతి వ్యవసాయ డిపార్ట్‌మెంట్ ద్వారా పాడి రైతు లకు 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. తద్వారా పశుగ్రాస పెంపకం చేపట్టి, పాల ఉత్పత్తి పెరిగే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పశుగ్రాస పెంపకం వల్ల రైతుకు దాణా ఖర్చు బాగా తగ్గి, లాభసాటిగా ఉంటుందని చెప్పారు. మండలంలో 28 గ్రామాల్లో ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ గుణాలమ్మ, పశువైద్య సహాయకుడు శ్యామ్ సుందరరావు, గోపాల్ మిత్ర రామ్మోహన్, జగదీష్ పాల్గొన్నారు.

పాతపట్నం ఇఒగా రామచంద్రరావు

రామచంద్రరావు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఇఒగా వి.రామచంద్రరావు ఉద్యోగ బాధ్యతలను శుక్రవారం చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా రాజాం మండలం నందబలగా పంచాయతీ నుంచి పాతపట్నానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జీ ఇఒగా కిషోర్ కుమార్ బాధ్యతలు నిర్వహించారు. నూతన ఇఒకు సర్పంచ్ సిర్ల జోగారావు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బాధితుడికి రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని రణస్థలంకు చెందిన కెల్ల వెంకటేష్ గత కొన్ని నెలలుగా తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ శ్రీకాకుళం ఆస్పత్రిలో చేరాడు. ఎమర్జెన్సీ విభాగంలో ఉంచి చికిత్స అందిస్తున్న కారణంగా వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి, వైద్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి ధైర్యం చెపుతూ త్వరగా కోలుకోవాలని రూ.20 వేలు రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సంస్థ ప్రారంభించి కొద్ది రోజులకే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెట్లు నరికితే పర్యావరణానికి నష్టమే

ప్రజాశక్తి- మందస

మండలంలోని గంగువాడ ఉద్దానంలో ఎమ్మెల్యే గౌతు శిరీష మొక్కలు నాటి పర్యావరణానికి పచ్చదనమే పరిరక్షణ అన్నారని, కార్గో ఎయిర్‌పోర్టుతో లక్షలాది చెట్లు ఎలా తొలగిస్తారని, ఇది పర్యావరణ విధ్వంసం కాదా? అని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసుదేవ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పచ్చని తివాచీపరిచినట్లుగా ఎటువైపు చూసినా జీడి కొబ్బరి, ములగ, మామిడి, పనస, అరటి తోటలతో ఆహ్లాదకరంగా ఉద్దానం పచ్చగా ఉందన్నారు. అడుగునా చెట్లతో నిండిన ఈ ప్రాంత ప్రజలకు కావాల్సిన ఆక్సిజన్, పచ్చదనం, పర్యావరణానికి కాపాడుతున్న ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మించడం సబబు కాదని అన్నారు. ఉద్దానం, వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు కార్యదర్శి జోగి అప్పారావు, ఉపాధ్యక్షులు లండ రామస్వామి, పెద్దలు పొట్టి ఎర్రయ్య, రాంపురం పంచాయతీ సర్పంచ్ పొట్టి ధర్మారావు, లోకనాథం, పరశురాం, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోరాట కమిటీ సభ్యులు

విద్యుత్ కోతలతో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వేళాపాల లేని విద్యుత్ కోతలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణం, పల్లె రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగజేస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతూ ఒకవైపు దోమలు మరో వైపు నిద్రలేని రాత్రులను గడుపుతున్నామని పలువురు వాపోతున్నారు. గడచిన మూడు, నాలుగు రోజులుగా అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలో రాత్రి 10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి అర్ధరాత్రి ఒంటి గంటకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మళ్లీ గంట సేపటి తరువాత విద్యుత్ తీసి వేసి వేకువజామున 4 గంటలకు విద్యుత్ పునరుద్ధరించారని పట్టణవాసులు చెబుతున్నారు.

పల్లెల్లో 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి వేకువజామున 3 గంటలకు విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. ఇలా వేళాపాలా, ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్‌ను నిలిపివేయడంలో ఆంతర్యమేమిటో అంతు చిక్కడం లేదని పలువురు విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని విద్యుత్ కోతలపై ప్రశ్నిస్తే ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ (ఇఎల్ఆర్) పేరిట చిలకపాలెం సబ్ స్టేషన్‌లోనే అనధికార విద్యుత్ కోతను అమలు చేస్తున్నారని చెబుతున్నారని విద్యుత్ వినియోగదారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు తీవ్ర ఎండ వేడిమి మరోవైపు దోమల బెడదతో నిద్రలేక ఒత్తిడికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అనధికార కోతలకు చెక్ పెట్టాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విద్యుత్ కోతలతో సతమతం

రెండు, మూడు రోజులుగా విద్యుత్ కోతలతో సతమతమైపోతున్నాం. శుక్రవారం రాత్రి నుండి వేకువజాము వరకు విద్యుత్‌ను పలు దఫాలుగా నిలిపివేయడంతో పలు విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. విపరీతమైన ఉష్ణోగ్రతలు ఒక వైపు దోమల బెడదతో నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నిద్రపట్టక రోగుల మాదిరిగా తయారయ్యాం. గతంలో ఎన్నడూ విద్యుత్ కోతల బెడద ఉండేది కాదు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.

దుప్పల భూదేవి, పాతినవారివీధి, ఆమదాలవలస

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

కోటబొమ్మాళి: మహిళ రక్షణకోసమే ప్రభుత్వం శక్తి యాప్‌ను తీసుకువచ్చిందని, మహిళలు, చిన్నారులు ఏదైన ఆపదలో ఉన్నప్పుడు ఈ శక్తి యాప్‌కు ఫోన్, మెసైజ్ చేస్తే వెంటనే మీకు శక్తిటీం వచ్చి ఆపద నుంచి కాపాడుతుందని టెక్కలి సబ్‌డివిజన్ శక్తి టీఎం ఎస్ఐ ఎం.రవి తెలిపారు. ఆయన తన బృందంతో కలిసి స్థానిక స్టేట్‌బ్యాంకులో శక్తి యాప్ గురించి శుక్రవారం మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తన ఫోన్‌ల్లో శక్తి యాప్‌ను అప్‌లోడు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక యాప్, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారని అన్నారు. కార్యక్రమంలో శక్తిటీం సిబ్బంది ఎం.గిరిధర్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

అక్రమ నిర్మాణాలపై చర్యలు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘంలోని అక్రమ కట్టడాలను గుర్తించి వాటిపై స్థానిక కోర్టులో కేసులు నమోదు చేసి పురపాలక సంఘ ఆదాయంను మెరుగుపర్చాలని కోరారు. ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితోకూ దరఖాస్తులు పెట్టించి వారికి భవనానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

జశ్వంత్ సాయికి అవార్డు

జస్వంత్ సాయి

నందిగాం: మండలంలోని లక్కీదాసుపురం పాఠశాలకు చెందిన బాలక జశ్వంత సాయి పదో తరగతిలో 582 మార్కులు సాధించాడు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ 'షైనింగ్ స్టార్ అవార్డు'కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు శుక్రవారం తెలిపారు. అవార్డు పేరిట రూ.20 వేలు నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం ఈ నెల 9న కలెక్టర్ అందజేస్తారని అన్నారు. జశ్వంత్ సాయికి హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు ఆర్.రామారావు, టి.ప్రసాదరావు, బి.రత్నం, డి.శ్రీనివాస్, వై.త్రినాథరావు, బి.వి.కె.ప్రియదర్శిని, ఎన్.గోవిందరాజు, విద్యా కమిటీ చైర్మన్ మాదిన సీతారాం, వైస్ చైర్మన్ మోగడ కుమారి, చమళ్ల సీతారాం, మాజీ సర్పంచ్ మాదిరి లోకనాథం, మోహనరావు, జోగారావులు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడలో శుక్రవారం భావనపాడు మైరైన్ పోలీసుల ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని భావనపాడు మెరైన్ సిఐ డి.రాము ప్రారంభించారు. రాగోలు జెమ్స్ వైద్యులు బి.వంశీకృష్ణ, జి.సంధ్యారాణి, పి.శరత్‌చంద్ర, జి.కీర్తిలు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిసి, సుగర్, ఇసిజి, 2డి ఇకో వంటి వైద్య పరీక్షలు చేశారు. మెరైన్ ఎస్ఐలు వి.శ్రీనివాసరావు, బి.మన్మథరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.